# ఉత్ప్రేక్ష

## నడిమింటి జగ్గారావు



రంగడికి మనసు మనసులో లేదు. ఆ అమ్మాయి రూపమే కళ్ళలో కదుల్తోంది. ఆమె అమాయకత్వం, ఆ కళ్ళలో బేలతనం, పసితనపు ఛాయలు ఇంకా వదలిపోని ముఖం.

జరిగిందేంటంటే - రంగడు ఆ సాయంత్రం తన బ్రహ్మచర్యపు వంటరితనాన్ని తట్టుకోలేక, వాడు అలాంటి సందర్భాలలో అలవాటుగా వెళ్ళే పంకజం కంపెనీకి వెళ్ళాడు. వేశ్యా గృహాల్ని కంపెనీల నిగూడా అంటారు.

గదిలోకి వచ్చిన అమ్మాయిని చూస్తే ఆశ్చర్యం కలిగింది వాడికి.వృత్తిలో రాటు తేలిన వాళ్ళకుండే కరుకుదనం, వృత్తిపరంగా వ్యక్తికి ఉండే లాఘవమూ ఆమె చూపులోగానీ కదలికలోగానీ లేవు. తనకి సుతారామూ ఇష్టంలేని పనిని తప్పక చేస్తున్న మనిషిలాగా ఉన్నాయి ఆమె చేష్టలు. అదే మరో సందర్భంలోనైతే....

“డబ్బుచ్చుకుని మొకం ముడుసుకుంటావేమే...?” అంటూ ఆమె అంతు చూసే వాడే. కానీ ఆ పిల్లని చూస్తుంటే రంగడికి అలాంటి కోపం రాలేదు. పైగా ఆమెని చూస్తుంటే జాలి వేసింది.

గత కొద్ది రోజులుగా రంగడు ఆత్మావలోకనం చేసుకుంటున్నాడు.

“నేను ఎవర్ని? - దొంగని”

జేబులు కొట్టేవాణ్ని. ఐక్లాను మొగోళ్ళకి లోక్లాసు ఆడాళ్ళని కమిషన్ కోసం తీసుకెళ్లి అప్పజెప్పేవోణ్ని. ముందూ ఎనకా ఎవరూ లేనోణ్ని, పుట్టినప్పుడు ఏడిసినా, ఇయాళ నేను సస్తే ఏడ్వానికి ఎనక ఎవరూ లేనోణ్ని-

కడుపు నింపుకోడం కోసం కాని పనులు చేస్తూ బతుకుతున్నోణ్ని, ఎందుకు బతికున్నానో సరిగ్గా తెలీనోణ్ని -

“సీ! నా బతుక్కి అర్థం ఏటి?”

రెండు వారాల క్రితం గుడిదగ్గర జనం ఎక్కువగా ఉంటే, చేతికి పని చెప్పాడు రంగడు. వాడు బిజీగా ఉండగా గుళ్లో హరిదాసు చెబుతున్న మాటలు వాడి చెవిని పడ్డాయి.

“భగవంతుడు ప్రతి ఒక్కరినీ ఏదో ఒక ప్రయోజనం కోసమే సృష్టించాడు. ప్రయోజనం లేని పుట్టుక ఉండనే ఉండదు.”

ఆ మాటలు వాడి మనసులో బాగా నాటుకున్నాయి. ఇంటికొచ్చి తను కొట్టుకొచ్చిన పర్సులు మంచం మీద పడేసి తన 'సంపాదన' లెఖ్ఖ పెట్టుకుంటుంటే మళ్ళీ అవే మాటలు గుర్తుకొచ్చాయి వాడికి.

“అవునూ, నా బతుక్కి పెయోజనం ఏటీ?” మరోసారి అనుకున్నాడు.

“జీవితమంతా ఇలా చిన్నా పెద్దా దొంగతనాలు చేస్తూ పట్టుబడినపుడు జైలుకి వెళ్ళి వస్తూ, తను దొంగిలించిన సొమ్ములోంచి పోలీసు మామూళ్ళు,

రౌడీ మామూళ్ళు కట్టుకుంటూ, ఉన్నప్పుడు తినీ, లేనప్పుడు తినకా ఎన్నాళ్ళిలా!? అయినా యీ వయసు ఇలా ఎంతకాలం ఉంటుంది. పదేళ్ళ క్రితానికీ యిప్పటికీ తన స్పీడు తగ్గింది. ఇంకా కొంతకాలం గడిస్తే ఇప్పటి చురుకుదనం కూడా తగ్గిపోతాది.

నాబంనేదు. మనం ఏదో ఒటి సేసి లైపులో సెటిల్ అవ్వాల - ఇలా గెక్కువ కాలం బండి నాగనేం" అని అనుకున్నాడు వాడు.

వంకజం కంపెనీకి వెళ్ళినప్పుడు తనతో గడిపిన అమ్మాయి ముఖం వాడి కళ్ళల్లో మెదుల్తోంది.

"ఆయమ్మాయి బాగుంది. పిల్ల సెడిపోయిందిగానీ నేకపోతే పెల్లాడేవొచ్చు"ననిపించింది రంగడికి.

"అయినా మనకి మంచి కుటమానంలో పిల్లని అట్టుకొచ్చి పెళ్లిసేసీ వోడెవుడు?

మన పుటకే మనకి తెల్దు. మనకో కులమా, జాతా? మతవాఁ? ఎవుణ్ని మనకి పిలిచి పిల్లనిత్తారు?"

"పోనీ మనం సేసీదేవంత గవుర్నేరుద్దోగవాఁ? - అంచేత మనం సేసుకుని "చెటిల్" అవ్వాలంటే సెడిపోయింది తప్ప మరెవ్వరూ ముందుకు రారు. ఆళ్లేనా వత్తారా? ఎప్పుడు బైటుంటావోఁ, ఎప్పుడు కొట్లో వుంటావోఁ తెలని మనని ఆళ్ళు మాత్తరం ఎందుక్కట్టుకుంటారు?

సిస్సీ! మనకన్నా యీది కుక్కలు నయ్యం. జతకట్టడానికి మరో ఊరకుక్కేనా దొరుకుతాది. మన చంగతలా కాదు-

చుకం కావాలంతే పంకజం కంపెనీకో, అమ్మాజమ్మ కంపెనీకో డబ్బు జోబీలో ఎట్టుకుని పోవాలి. శ! శ! మనకి చెటిల్మెంటేటి?"

హఠాత్తుగా రంగడికి గుబులు పట్టుకుంది.

"ఇవ్వుడున్న వలంగా మనం నచ్చిపోతే ఏడ్సీవోడెవడూ లేడు నరికదా కనీనం శొశానానికి మోనుకుపోయీ వోళ్ళవళ్ళూ లేరు. మూడో రోజుకి మరింత కంపు బరించలేక కంప్లెయింటిత్తే మునిసిపాలిటీవోళ్ళు లాగిపారేత్తారు."

శ! అలా జరగడానికీల్లేదు! తను అలాంటి కుక్క సావు సవ్వడు. ఇంత బతుకూ బతికి, సచ్చినప్పుడేనా దర్జాగా పోవాలి. తనకి కూడా తలక్కొరివి పెట్టీవోడొకడు కావాలి. సావుఁలోరు సెప్పేడు తలక్కొరివి పెట్టీవోడొకడూ లేకపోతే సచ్చిపోయినోడు సొర్గవూఁ కాకంటా నరకవూఁ కాకంటా ఆకాశంలో తల్లకిందులుగా ఏళ్ళాడిపోతాడంట మరింక మనకెవుడూ కొరివెట్టకపోతే మరంతే చంగతులు.

పోనీ - వంకజం కంపెనీలో ఉన్న ఆ పిల్లని పెల్లాడేస్తే? కట్టుగా ఉండమని బతిమాలుకుందాం. దానికి మాత్తరం పెల్లిసేసుకునీ వోడు దొరకొద్దేటి? - అందులోనూ మనలాంటి రాజా దానికెక్కడ దొరుకుతాడు.

మనం కూడా కొంచెం సెడు తిరుగుళ్ళు మానీయాల. అది ఒప్పుకుంటే దాన్ని పెల్లాడి - ఒకళ్ళో యిద్దరో పిల్లల్ని కని ఆళ్ళని పెంచి పెద్ద సెయ్యాల. సిన్న యిల్లు నూసుకుని, సంపాదనలో కొంత యెనకేసి, దాన్ని మదుపెట్టుకుని సిన్న యాపారం సేసి నిలదొక్కుకోవాల. కనీసం మనకి పుట్టీ పిల్లలేనా "మీ నాన్నెవడ్రా?" అని ఎవురేనా అడిగితే ఆకాశం కానీ బూవిఁ కానీ నూడకూడదు.

"బడ్డీకొట్టు రంగన్న తెలుసా? - ఆడే మానాన్న" అని సంగంలో గర్వంగా సెప్పుకోవాల.

రంగడికి కొత్తదీ, ఆకర్షణీయమైనదీ అయిన కలని మొట్టమొదటిసారి చూస్తున్న అనుభూతి కలుగుతోంది. ఆ కలలో వాడుండగానే వాడికి ఎప్పుడో నిద్రపట్టింది.

మర్నాడు - బారెడు పొద్దెక్కాక నిద్రలేచిన రంగడు ఒళ్ళు విరుచుకుంటూ అనుకున్నాడు.

"రేవణ్నించీ మనం బేగి లెగాలి. మనం నంపాదననెంత? మనం ఎనకెయ్యవలసిందెంత? కొంచెం నూసుకోవాల".

ఒక కొత్త ఉత్సాహంతో బయల్దేరాడు రంగడు. దార్లో ఎదురుపడ్డాడు "గూనీ!" అని పిలవబడే సింహాచలం. అతని అసలు పేరు చాలామందికి తెలీదు. 'కంపెనీ'ల అమ్మాయిల కోసం విటుల్ని తీసుకొచ్చే డ్యూటీ చేసి అటు విటుల్నించీ, ఇటు కంపెనీల నుంచీ తన కమిషన్ వసూలు చేస్తూ బతుకుతుంటాడు సింహాచలం ఉరఫ్ గూని.

గూనికి 'బక్కోడి టీ కొట్టు దగ్గర టీ ఇప్పించి తన మనసులో మాట బయట పెట్టాడు రంగడు. వాడు

> **"...ఎవుడేనా నరే తను ఉన్న బతుకులోంచి పైకి లెగాల. తను లెగ్గలిగినప్పుడు తనవోణ్ని ఒకణ్ని తనతో పాటూ లెగదియ్యాల. మనలాంటోళ్ళ బతుకులు బావుపడాలంటే మరింక ఇదే పద్ధతి"**

అంతా విని "ఇయన్నీ జరిగేవి కావురా" అన్నాడు. "రోకు పెంచుకోకురా మంచిది కాద"న్నాడు. "అయినా నీకు యీ బుద్ధి ఎలా పుట్టిందిరా?" అని ప్రశ్నించేడు. "బజారు దాంతో పెల్లేటిరా?" అని అనుమానం వెలిబుచ్చాడు.

భల్లూకంలా తన పట్టు వదల్లేదు రంగడు.

"ఒరే గూనీ - నిన్ను లైపులో ఏటీ అడగలేదు. యీ ఒక్క సాయం సేసి పెట్రా - నీ ఫోటో మా ఇంట్లో పెట్టుకుని రోజూ నీకు దండవెట్టుకుంటాంరా, నువ్వు తల్సుకుంటే సెయ్యగలవురా, నీలాంటి పెద్దోడే సెయ్యకపోతే నాకు మరెవరు సేస్తార్రా!?" అన్నాడు.

"ఒరేయ్ నానుగోసిప్పుకుని తిరిగిన కాడ్నించి నన్ను నువ్వెరుగుదువు. నన్ను ఓ యింటోణ్ని సెయ్యిరా - యిదే నీ కొడుకు అడిగితే సెయ్యవురా?!" - ఆఖరి అస్త్రం ప్రయోగించాడు రంగడు.

'గూని'కి పిల్లల్లేరు. వాడు కరిగిపోయాడు.

మూడో 'టీ' తాగిన తర్వాత స్థిర నిర్ణయంతో లేచాడు గూని. "నరేరా, నువ్వింత బతివూల్తన్నావని ఒప్పుకుంటాను. నువ్వో రెండు వేలు సిద్ధం సేనుకో. నాను పంకజంతో మాటాడతాను."

రంగడి చిత్తశుద్ధికీ, హస్తలాఘవానికీ పరీక్ష పడింది.

"దేవుడా - రెండు వేలు - రెండంటే రెండు వేలు! దొరికేటట్టు నూడు తండ్రీ" - దేవుడు రంగడి మొర ఆలకించాడు. ఆ రోజు జగదాంబ సెంటర్లో నుంచి రెండో పెళ్ళాంతో బ్యాంకులోంచి బయటికి వచ్చిన మార్వాడీ జేబు కాటేశాడు రంగడు. అదృష్టం! మూడు వేలు! ఒక్క పర్సులో మూడు వేలు?

రంగడికి సృష్టంతా పచ్చగా - పచ్చనోటంత పచ్చగా కనిపించింది. మర్నాడు గూనికి రెండు వేలు ఇస్తుంటే వాడి చేతులు కృతజ్ఞతతో వణికాయి.

మూడో నాడు గూని సింహాచలంతో పాటూ రిక్షాలో కూర్చుని తన ఇంటివేపు వస్తున్న ఆ పిల్లని చూశాకగానీ రంగడికి ఉత్కంఠా, ఆతృతా తగ్గలేదు.

ఆ అమ్మాయి నెమ్మదిగా రిక్షా దిగి రంగడి ఇంట్లోకి వచ్చింది. వచ్చి రంగడికేసి విచిత్రంగా చూసింది. తర్వాత చిన్నగా చిరునవ్వు నవ్వింది. యిల్లు అనబడే తన రేకుల షెడ్డులో వెయ్యి మతాబాలు వెలిగినట్లయింది రంగడికి. పొద్దున్నే తనకి చేతనయినంత నీటుగా తన షెడ్డంతా సర్ది ఉంచేడు వాడు.

ఆమె వెనకాలే లోపలికి వచ్చిన సింహాచలం ఆమె బట్టల మూటని షెడ్డులో వారగా ఉన్న సీనా రేకు డబ్బా మీద పెట్టేడు.

"ఉరేయ్ రంగా, నా మాట నాను నిలబెట్టుకున్నాను. విదిగో పిల్ల. పెల్లెప్పుడు సేసుకుంటావో సెప్పు"

"పెద్దోడివి - నువ్వెప్పుడంటే అప్పుడే" ఆమెనే చూస్తూ అన్న రంగడి మాటలు సింహాచలానికి సంతృప్తినిచ్చాయి.

"అయితే నరే - బేవనోడితో సెప్పి సాయంత్రం సేయించేస్తాను. ఓ రెండొందలు కొట్టు" - రెండు వందలూ కొట్టాడు రంగడు. అవి తీసుకుని సింహాచలం బయటికి వెళ్ళిపోయాడు. రంగడు మెల్లిగా అమె దగ్గరికి జరిగాడు. జరిగి ఆమె దగ్గర కూర్చున్నాడు.

"నీ పేరు?" మార్దవంగా అడిగాడు.

"మల్లీస్పరీ" - గొంతు బావుంది.

"నాతో పెల్లినీ కిస్టవేఁనా"

"పెల్లంటే ఏ ఆడదాని కిష్టవుండదు?" అని ఆమే మళ్ళీ అడిగింది "అవునూ పెల్లాడ్డానికి నన్నే ఎందుకు సెలక్షను సేసుకున్నావ్?!"

"నువ్వు నాకు నచ్చావు - అందుకు" - అన్నాడు రంగడు.

"అది కాదు. నా బతుకు నీకు తెలుసు కదా - మరి?! 'అర్థోక్తిలో ఆగిపోయింది ఆమె.

"నా సంగతి కూడా నీకు సింవాశెలం సెప్పేవుంటాడు. నోకంలో ఎవుడి మడుసుల్ని ఆడు ఆదుకుంటున్నాడు. నువ్వూ నేనూ ఒకలాంటి బతుకులోనే ఉన్నాం. మనని మనవేఁ ఆదుకోకపోతే మరి మనని ఆదుకునీదెవడు? ఎవుడేనా సరే తను ఉన్న బతుకులోంచి పైకి లెగాల. తను లెగ్గలిగినప్పుడు తనవోణ్ని ఒకణ్ని తనతో పాటు లెగదియ్యాల. మనలాంటోళ్ళ బతుకులు బావుపడాలంటే మరింక ఇదే పద్ధతి" రంగడి మాటలు వాడి గుండెల్లోంచి వచ్చాయి.

ఆమె అతని ముఖంలోకి తేరిపార చూసింది.

ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

ఒక్కసారిగా కుప్పకూలిపోయినట్టుగా అతని ఒళ్ళో వాలిపోయింది.

గుండెల్లోంచి ఉబికి ఉబికి వచ్చే ఏడుపుని నిగ్రహించుకోలేకపోయింది. ఒక్కసారిగా సముద్రం పొంగినట్టు, గుండె పగిలేటట్టూ ఘొల్లుమని ఏడ్వడం మొదలెట్టింది.

ప్రపంచంలో చెడే కాదు - మంచి కూడా ఉందని ఆమెకి మొదటిసారిగా స్ఫురించింది.

అది ఆనందమో, ఆశ్చర్యమో, బాధో ఆమెకే తెలియదు.

ఆమె అలా ఏడుస్తూనే ఉంది. అతడు ఆమె తల నిమిరాడు.